క్లుప్తంగా

ఘనంగా స్వయం పాలన



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సునిత, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, నాయకులు ఎజాజ్ అలీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 2008–2009 పదో తరగతి పూర్వ విద్యార్థినులు సోమవారం స్టార్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 16 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను వేదికపై పిలిచి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు కొమురమ్మ, మౌనిక, అరుణ, రూబియా, సమీనా, సమంత, భవాని, రజియా, జ్యోతి, శారద, స్వాతి తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

కొందుర్గు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో న్యూషావలిన్ కుంగ్‌ఫూ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కరాటే అండ్ కుంగ్‌ఫూ పోటీల్లో కొందుర్గు విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మాస్టర్ రమేశ్ సోమవారం తెలిపారు. ఫైరింగ్ విభాగంలో కొందుర్గుకు చెందిన ఎండీ నహీద్ మొదటి స్థానం, వంశీ రెండో స్థానం, ఎండీ అస్లాం తృతీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వాహకులు విద్యార్థులను అభినందించి మెమొంటోలతో పాటు ప్రశంసపత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

విగ్రహావిష్కరణకు తరలిన మహిళలు



బస్సులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు కార్యక్రమం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సచివాలయం వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ నుంచి 4 ప్రత్యేక బస్సుల్లో సుమారు 200లకు పైగా మహిళలు బయలుదేరి వెళ్లగా.. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు హైదరాబాద్‌కు వెళ్తున్న మహిళలకు ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ కార్యదర్శిని కలిసిన నాయకులు



ఏఐసీసీ కార్యదర్శి సంతోష్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: ఇటీవల జరిగిన జార్ఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్ వార్‌రూమ్ చైర్మన్‌గా ఉంటూ అక్కడ కూటమి విజయం సాధించటంలో కీలకంగా పనిచేసి తిరిగివచ్చిన ఏఐసీసీ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను చేవెళ్లలో పీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ బి.యాదిరెడ్డి కలిసి స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. జార్ఖండ్ నుంచి వచ్చిన ఆయన సోమవారం చేవెళ్ల మీదుగా వికారాబాద్‌కు వెళ్తుండగా చేవెళ్లలో ఆగిన ఆయనకు స్వాగతం తెలిపారు. ఆయనను కలిసిన వారిలో రవీందర్, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

చివరి మజిలీకి తిప్పలెన్నో!

శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కరువు
- విద్యుత్, నీటి సదుపాయం లేక నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు
- అంత్యక్రియలకు అవస్థలు



కొత్తూరు పట్టణంలోని శ్మశానవాటిక



కుళాయిలు ధ్వంసం చేయడంతో వృథాగా మారిన గదులు

కొత్తూరు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దహన సంస్కారాలకు ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో వైకుంఠధామం నిర్మించాలని నిర్ణయించింది. ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేస్తూ ఇందు కోసం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ నిర్ణయం ఘనంగా ఉన్నా క్షేత్రస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. శ్మశానవాటికలను నిర్మించిన అధికారులు నీటి సౌకర్యం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో బాధిత కుటుంబాలు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

నిర్మాణాలు ఇలా..

మండలంలోని 12 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో రెండు చోట్ల వైకుంఠధామాలను నిర్మించారు. కాగా ప్రస్తుతం వాటికి నిర్వహణ లేకపోవడంతో బాధిత కుటుంబాలకు ఖననాల (అంత్యక్రియల) నిర్వహణకు మరింత భారం అవుతోంది. శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు ప్రతిపాదనలతోనే సరిపెడుతుండడంతో బాధిత కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

నిర్వహణే భారం..

గత ప్రభుత్వం గ్రామాల్లో శ్మశానవాటికల నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షల 70వేలను కేటాయించింది. ఈ నిధులతో మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్స్, స్నానాల గదుల నిర్మాణాలు చేపట్టారు. అంతేగాకుండా వైకుంఠధామానికి వచ్చే ప్రజలు, వృద్ధులు వేచి ఉండేందుకు షెడ్ల నిర్మాణం, మృతదేహాలను ఖననం చేసేందుకు రెండు ప్లాట్‌ఫాంలు (దింపుడు కల్లం)లను నిర్మించింది. కాగా వైకుంఠధామాల నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో సరైన సౌకర్యాలు లేక బాధలోనూ బాధిత కుటుంబాలే ఖర్చులు భరించాల్సి వస్తోంది.

స్నానాల గదులు, నీరు లేక..

గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల నిర్వహణ ప్రస్తుతం భారంగా మారింది. కొన్నిచోట్ల వైకుంఠధామాల్లో బోర్లు లేక స్నానాల కోసం, కాళ్లు, చేతులు కడుక్కోవడానికి అక్కడ నీటి వసతి ఉండడం లేదు. బాధిత కుటుంబాలు తమ ఖర్చులతో ట్యాంకర్‌ను తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల దాతలు, పంచాయతీలు ఉచితంగా నీటి ట్యాంకర్లను సరఫరా చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిర్వహణ లేకపోవడంతో గదులకు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలను దొంగలు ఎత్తుకెళ్లారు. కుళాయిలను పగులగొట్టడంతో స్నానాలు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వైకుంఠధామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో రాత్రిళ్లు చీకట్లు అలుముకుంటున్నాయి.

మరమ్మతులు చేపడతాం



గ్రామాల్లోని వైకుంఠధామాల్లో నీటి కుళాయిలు, ట్యాంకులను దొంగలు ఎత్తుకెళ్లారు. మరికొన్ని చోట్ల కుళాయిలు, గదులను ధ్వంసం చేశారు. వైకుంఠధామాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

– అరుంధతి, ఎంపీడీఓ, కొత్తూరు

'సీఎం కప్' నిర్వహణకు ఏర్పాట్లు

నేటి నుంచి 12వ తేదీవరకు క్రీడాపోటీలు

షాబాద్: మూడురోజుల పాటు మండలస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌తో కలిసి క్రీడల నిర్వహణ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 12వ తేదీవరకు మండలస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనేవారు ఖచ్చితంగా తమ గ్రామ పంచాయతీ తరపున ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. 10వ తేదీన వాలీబాల్, 11వ తేదీన కబడ్డీ, 12వ తేదీన ఖోఖో పోటీలు, అథ్‌లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులతో పాటు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. సీఎం కప్ షాబాద్ మండల ఇన్‌చార్జి బాబయ్య 8008778084 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.



షాబాద్ మోడల్ స్కూల్‌లో క్రీడాపోటీలకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

ఏర్పాట్లు పూర్తి

నందిగామ: మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలకు అధికారులు సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని గ్రౌండ్‌ను ఎంపీడీఓ సుమతి, ఎంపీఓ తేజ్ సింగ్, ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎంపీడీఓ సుమతి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఉన్నత పాఠశాలల పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

17న మందకృష్ణ మాదిగ రాక

ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17న షాద్‌నగర్‌లో నిర్వహించనున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగ విద్యార్థుల సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ రానున్నారని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నానిభాను ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలును వ్యతిరేకిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పతనం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ మాలలను నెత్తిన పెట్టుకొని మాదిగలను పాదాల కింద తొక్కుతుందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ వెంటనే అమలుచేసి సామాజిక న్యాయంపై తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న పట్టణంలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల సదస్సుకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారన్నారు. ఈ సదస్సుకు నాయకులు, సభ్యులు, దళితులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, నాయకులు ఆనంద్, శివ, ప్రేమ్‌కుమార్, దశరథ్, ఆకాశ్, సురేష్, ప్రవీణ్, మనోజ్ పాల్గొన్నారు.

గణిత టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(కుంటబడి)లో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్టును సోమవారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో మండల పరిధిలోని విశ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కార్తీక్ ఉత్తమ ప్రతిభను కనబరిచాడు. మండలస్థాయి టాలెంట్ టెస్టులో తృతీయ స్థానంలో రాణించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి కార్తీక్‌ను ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయుడు శేఖర్ అభినందించారు. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

మార్కెట్ యార్డు గోదాం పరిశీలన

కొందుర్గు: మండల కేంద్రంలో ఉన్న మార్కెట్ యార్డు గోదాంను సోమవారం నూతన పాలక వర్గం, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు గోదాం ఆవరణలో ఉన్న బోరును ఓ రైతు వాడుకుంటున్నారని తెలుసుకొని రైతుతో మాట్లాడారు. ప్రస్తుతం గోదాం ఆవరణలో వృథాగా ఉన్న బోరుబావిలో తన మోటార్ అమర్చుకొని నీటిని వాడుకుంటున్నానని రైతు తెలిపారు. గోదాం ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉందని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలిఖాన్ బాబర్ మార్కెట్ సెక్రటరీ శ్రీనివాసును ప్రశ్నించగా గోదాం ఎస్‌డబ్ల్యూసీకి రెంట్‌కు ఇచ్చామని, నెలకు రూ.60,600లు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు ఇబ్రహీం, నరేందర్, ఇసాక్, గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో తెలంగాణ ప్రదాత, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని కొనియాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ పాలన కొనసాగుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పలు మండల కేంద్రాల్లో అంబేడ్కర్ చౌరస్తాల వద్ద కార్యకర్తలు ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు.



షాద్‌నగర్‌రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కేశంపేట: సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



షాబాద్: షాబాద్‌లో..



నందిగామ: కేక్ కట్ చేస్తున్న నాయకులు



కొత్తూరు: వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



కొందుర్గు: కొందుర్గులో..



మొయినాబాద్: మండల కేంద్రంలో..

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



సభ్యత్వ నమోదు చేపడుతున్న జంగయ్య

కొత్తూరు: సీపీఐ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆయన సోమవారం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో సంఘం జెండాను ఆవిష్కరించడంతో పాటు సభ్యత్వ నమోదును చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఐ ఏర్పాటై డిసెంబర్ 26 నాటికి 99 ఏళ్లు పూర్తి చేసుకుని వంద సంవత్సరాలు అవుతుందన్నారు. వందేళ్లలో పార్టీ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రైతులు, కార్మికులతో పాటు పలు సమస్యలపై చేపట్టిన పోరాటాలతో ఎన్నో విజయాలను సాధించినట్లు వివరించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజా సమస్యల సాధనకు ప్రభుత్వాల మీద గళం విప్పుతూ ప్రజలకు అండగా ఉండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు పానుంటి పర్వతాలు, అజ్మత్, మైసయ్య, నర్సింహ, మహమూద్, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు అడిగితే.. అరెస్టులా?

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు భూపాలచారి



పోలీసుల అదుపులో భూపాలచారి

కొందుర్గు: తమకు రావాల్సిన పాత బకాయిలు చెల్లించాలని అడిగితే అరెస్టులా అని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు కమ్మరి భూపాలచారి ప్రశ్నించారు. బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా సోమవారం పోలీసులు మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేశారు. ఇందులో భాగంగా చౌదరిగూడ పోలీసులు భూపాలచారిని హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవలో భాగంగా అప్పులతో అభివృద్ధి పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయమై న్యాయంగా బిల్లులు అడిగితే పోలీసులతో అరెస్టులు చేయించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

పనికి తగిన క్రెడిట్ ఇవ్వాలని వినతి

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి పని, పథకంలో పంచాయతీ కార్యదర్శులు నిర్విరామంగా పని చేస్తున్నప్పటికీ తమని ఎవరూ గుర్తించి, ప్రోత్సహించడం లేదని శంకర్‌పల్లి పంచాయతీ కార్యదర్శులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం శంకర్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజుకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సార్వత్రిక ఎన్నికలు, మిషన్ భగీరథ నల్లా సర్వే, ప్రజాపాలన దరఖాస్తులు, కులగణన సర్వే, ప్రజాపాలన విజయోత్సవాలు, సీఎం కప్ పోటీలు ఇలా ప్రతి పనిని తామే చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమకు క్రెడిట్ ఇవ్వడం లేదన్నారు. దీంతో తాము మానసికంగా ఆవేదనకు గురవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల సర్వేకి నిర్దిష్ట గడువు కాకుండా, కొంత సమయం ఇవ్వాలని, ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శికి 200 దరఖాస్తులు మాత్రమే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి

చేవెళ్ల: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్‌గారి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన కుటుంబానికి చెందిన సోనియాగాంధీ దేశాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారన్నారు. డిసెంబర్ 9వ తేదీ సోనియాగాంధీ జన్మదినంతో పాటు తెలంగాణ ప్రకటించిన రోజు కూడా కావటం రాష్ట్ర ప్రజలు ఆమెను గుర్తుచేసుకుంటూ వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఇటీవల ఎన్నికైన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్గారి కార్తీక్‌రెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.రాములు, పార్టీ జిల్లా నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, పీసీసీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

బహుజన బిడ్డకు అండగా ఉంటాం

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ నురేందర్



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు దళిత సమాజం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తాలుకా కన్వీనర్ కర్రోల్ల సురేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు సింగపాగ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కర్రోల్ల సురేందర్ మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో వెలమ దొరలు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. పోలీసు వ్యవస్థను అడ్డంగా పెట్టుకొని అమాయకులైన ఎస్సీ, ఎస్టీ, బీసీలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేశారన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్యేపై వెలమలు దురహంకారంతో ఇష్టానుసారంగా దూషించడం తగదన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన విషయాలను ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే మాట్లాడిన మాటలను వక్రీకరించి కుట్రపూరితంగా కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఎమ్మెల్యేపై అసభ్యంగా మాట్లాడిన వెలమలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నాగి సాయిలు, నాయకులు జాంగారి రవి, ఎర్రోల్ల జగన్, అంతయ్య, స్వామి, జంగయ్య, ప్రభు, కృష్ణ, వెంకటయ్య, యోగి, కృష్ణయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వీరేందర్‌రెడ్డి మృతి తీరని లోటు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర వీరేందర్‌రెడ్డి మృతి తీరని లోటని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తాండ్ర వీరేందర్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని అస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో సోమవారం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యేలు ఎల్లనమోని అంజయ్యయాదవ్, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఇందిరలతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దహన సంస్కార కార్యక్రమంలో పాల్గొని వీరేందర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ వాదాన్ని బలంగా నియోజకవర్గంలో వ్యాప్తి చేయడంలో తనతో పాటే ఉన్న స్నేహితుడైన తాండ్ర వీరేందర్‌రెడ్డి మృతి చెందడం బాధకరమని మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం నిర్వహించిన శవయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాడె మోశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, కొత్తపేట పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, న్యాయవాదులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో ప్రజలు సతమతం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు స్వామి



దుర్వాసన వస్తున్న కంపెనీ పరిసర ప్రాంతాలను సీఈఓకు చూపిస్తున్న గ్రామస్తులు

షాబాద్: కాలుష్య కోరల్లో నుంచి తమ గ్రామాలను కాపాడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని చందనవెల్లి పరిశ్రమల వద్ద గల కుందన్ టెక్స్‌టైల్స్ కంపెనీలో వాయు కాలుష్యం, జల కాలుష్యం ఎక్కువగా రావడంతో చందనవెల్లి గ్రామస్తులు సోమవారం కంపెనీ సీఈఓ సుధాకర్‌ను కలిసి ఆయనకు కంపెనీ పరిసర ప్రాంతాలు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అనుకుంటే కాలుష్యంతో నిండిపోతుందన్నారు. కాలుష్యంతో చందనవెల్లి, హైతాబాద్, మాచన్‌పల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుందన్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యంతో చిన్నపిల్లలు, వృద్ధులు దమ్ము, శ్వాసకోస సంబంధిత వ్యాధు గురవుతున్నారన్నారు. కాలుష్య కోరల నుంచి గ్రామస్తులను, పశువులను కాపాడాలని, కంపెనీపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564